న్యూస్‌రీల్

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జోబిన్

మంచిర్యాలఅర్బన్: సిరిసిల్లలో జరిగిన శ్రీ చైతన్య విద్యాసంస్థల వార్షిక జోనల్ స్పోర్ట్స్ మంచిర్యాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో చదువుతున్న శ్రీ నిత్య, అక్షర పరుగు పందెంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనిత్య, అక్షరలను ప్రిన్సిపాల్ జోబిన్ అభినందించారు. ఆర్ఐ రాజు, ఏవో విలాస్, పీఈటీ రాజేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

బెల్లంపల్లి: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయడమే కాదు ఉత్తమ సౌకర్యాలు కల్పించడంలోనూ తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీఓఈ) కళాశాల ముందంజలో ఉందని బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ అన్నారు. సంక్షేమ గురుకుల సీఓఈలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శనివారం విద్యార్థులకు పలు రకాల ఎనిమిటీస్ పంపిణీ చేశారు. విద్యార్థులు చక్కగా వినియోగించుకుని శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ షేక్ ఆస్మా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గర్మిళ్ల పాఠశాలలో ఫుడ్‌కార్నివాల్

మంచిర్యాలఅర్బన్: స్థానిక గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం లిటిల్ మాస్టర్, లిటిల్ చెఫ్‌లో భాగంగా రుచికరమైన వంటల కార్యక్రమం నిర్వహించారు. 20మంది టీచర్లు, 100మంది విద్యార్థులు వంటలు తయారుచేసి ప్రదర్శనగా ఉంచారు. 2023కు స్వాగత కార్యక్రమ భాగంలో కార్యక్రమం నిర్వహించారు. తొమ్మిదో తరగతికి చెందిన అక్షయకు ప్రథమ, తమలపాకు లడ్డు చేసిన స్వాతిక్ (8వతరగతి) ద్వితీయ, గారెలు రాగి లడ్డు లకు అక్షయ (10వ తరగతి) తృతీయ బహుమతులు గెలుపొందగా బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రభుత్వవిప్

చెన్నూర్: పట్టణానికి చెందిన మల్లెల వికాస్‌రెడ్డి దర్శకత్వంలో ప్రముఖ సినీ నటి సుధ నటించిన 'రాతి గుండె.. నీది ఈశ్వరా' వీడియో ఆల్బమ్ పోస్టర్‌ను శనివారం మంత్రి క్వార్టర్‌లో ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆవిష్కరించారు.

మోటివేషన్ తరగతులు

జన్నారం: మండల కేంద్రంలోని రాఘవేంద్ర లిటిల్‌హార్ట్స్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ప్రముఖ ట్రైనర్, మానసిక వైద్య నిపుణుడు రాజేందర్ హాజరై చిన్నప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటున్న తల్లిదండ్రులను కష్టపెట్టకుండా, వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.

'తప్పుడు ప్రచారం మానుకోవాలి'



మాట్లాడుతున్న న్యాయవాదులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో కోర్టు భవనం కోసం కేటాయించిన స్థలం నిర్మాణానికి పూర్తిగా అనువైనదని, ఆ స్థలంపై ఎలాంటి అనుమానాలు వద్దని బెల్లంపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అంకెం శివకుమార్, చేను రవికుమార్, సీనియర్ న్యాయవాది టీ.గోపికిషన్ సింగ్ స్పష్టం చేశారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఆ స్థలాన్ని మార్చాలని చేసిన ప్రకటనను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కోర్టు భవన నిర్మాణానికి స్థలం కోసం, నిధుల మంజూరు కోసం ఎంతగానో శ్రమపడాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వ భూమిని ఎంపిక చేసి కోర్టుకు అప్పగించాక సాయిల్ టెస్ట్ చేయించి అంతా సవ్యంగానే ఉందని రిపోర్టు వచ్చిన తర్వాతనే అన్నిరకాల అనుమతులు తీసుకుని భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కోర్టు భవన నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. సమావేశంలో బార్ అసోసియేషన్ సభ్యులు చిప్ప మనోహర్, జీ.శ్రీనివాస్, సంగీత, సునీల్, సౌమ్య, సీ.హెచ్.శ్రీనివాస్, అశోక్, రాజేష్, బాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ జోష్..!





జిల్లా కేంద్రంలో రంగుల కొనుగోలు సందడి



కేక్ తీసుకెళ్తున్న చిన్నారులు



శ్రీరాంపూర్: కేక్ కట్ చేస్తున్న సేవా అధ్యక్షురాలు



ఆర్‌బీహెచ్‌వీ పాఠశాలలో...



శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో...



మంచిర్యాలలో సంబురాల్లో విద్యార్థులు



చెన్నూర్‌రూరల్: కేక్ కట్ చేస్తున్న హెచ్‌ఎం



కాసిపేట: దేవాపూర్‌లో...



లక్సెట్టిపేట: కేక్ కట్ చేస్తున్న ఎస్సై లక్ష్మణ్



మంచిర్యాలటౌన్: అంగన్‌వాడీల కేక్ కటింగ్



మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో...

మంచిర్యాలఅర్బన్/మంచిర్యాలటౌన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/చెన్నూర్‌రూరల్/లక్సెట్టిపేట/కాసిపేట/శ్రీరాంపూర్: నూతన సంవత్సర వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. 2022 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. 2023 సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. బేకరీలు, రంగుల దుకాణాల్లో ప్రజలు కిక్కిరిసారు. పలు ప్రభుత్వ ప్రాథమిక, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు కొన్నిచోట్ల చిన్నారులు, యువతీ యువకులు, పెద్దలు అంతా ఏకమై కేక్‌లు కట్ చేశారు. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పకుంటూ సంబురంగా గడిపారు.నూతన సంవత్సర వేడుకలను అందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని, ఇతరులకు హాని కలిగించొద్దని పోలీసులు సూచించారు.



మంచిర్యాలలో విద్యార్థుల సంబురాలు



కేక్ కట్ చేస్తున్న విద్యార్థినులు

అయ్యప్ప స్వాముల నిరసన



లక్సెట్టిపేట: ధర్నా నిర్వహిస్తున్న అయ్యప్పస్వాములు



బెల్లంపల్లి: ర్యాలీ చేస్తున్న అయ్యప్పస్వాములు

బెల్లంపల్లి/మందమర్రిరూరల్/కాసిపేట/జైపూర్/తాండూర్/లక్సెట్టిపేట/నస్పూర్/చెన్నూర్: అయ్యప్ప స్వామిపై, హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భైరి నరేశ్‌పై చర్యలు తీసుకోవాలని అయ్యప్ప స్వామి భక్తులు శనివారం జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. అయ్యప్ప స్వాములు, హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన నరేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. జాతీయ రహదారులపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు.

కుంటలో పడి కార్మికుడు మృతి

బెల్లంపల్లి: బెల్లంపల్లి శాంతిఖని గనిలో పని చేస్తున్న ఓ బదిలీ వర్కర్ కార్మికుడు కుంటలో పడి మృతి చెందాడు. టూటౌన్ ఎస్సై ఆంజనేయులు కథనం ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాలిటీ రడగంబాల బస్తీలోని ఓ అద్దె ఇంట్లో భార్యపిల్లలతో కలిసి నివాసం ఉంటున్న పోగుల సంతోష్ (32) సింగరేణి కార్మికుడు శుక్రవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి శనివారం ఉదయం ప్రభుత్వ ఆసుపత్రి, కుంట రాములు బస్తీల మధ్య ఉన్న కుంటలో శవమై తేలాడు. సంతోష్ ప్రమాదవశాత్తు కుంటలో పడి చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రెబ్బెన మండలం గోలేటిటౌన్‌షిప్‌కు చెందిన మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కలప తరలింపు అడ్డగింత

భీమారం: మంచిర్యాల అటవీడివిజన్ పరిధి భీమారంలోని నీలగిరి ప్లాంటేషన్ నుంచి కలప తరలింపుని శనివారం వీఎస్ఎస్ సభ్యులు అడ్డుకున్నారు. లారీలను వెనక్కి పంపించారు. అటవీశాఖ, వనసంరక్షణ సమితి సభ్యులు సంయుక్తంగా 1997సంవత్సరంలో 10హెక్టార్లలో నీలగిరిప్లాంటేషన్ కోసం మొక్కలు నాటినట్లు తెలిపారు. ప్లాంటేషన్‌లోని కలప అమ్మే సమయానికి వీఎస్ఎస్‌కి సగంవాటా ఇస్తామని అటవీశాఖ అప్పట్లో అగ్రిమెంట్ చేసుకున్నట్లు వాపోయారు. అటవీశాఖ ఒప్పందం ప్రకారం అమ్మిన చెట్లకి వచ్చే ఆదాయంలో సగం వాటా ఇచ్చేవరకు పనులు నడవనీయమని స్పష్టం చేయగా, పనులు నిలిచిపోయాయి. ఈ విషయమై అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ రామకృష్ణసర్కార్‌తో 'సాక్షి' మాట్లాడగా వీఎస్ఎస్ సభ్యులు నీలగిరి చెట్ల నరికివేత ఆపిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానన్నారు.



లారీని అడ్డుకుంటున్న వీఎస్ఎస్ సభ్యులు

మందమర్రి ఏరియాలో 83శాతం బొగ్గు ఉత్పత్తి



ఉత్పత్తి వివరాలు వెల్లడిస్తున్న జీఎం శ్రీనివాస్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో గత నెల 83శాతం బొగ్గు ఉత్పత్తి జరిగినట్లు ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. కేకే–1 గనిలో 12,769 టన్నులు, కేకే–5 గనిలో 13,653 టన్నులు, శాంతిఖనిలో 5,986 టన్నులు, కాసిపేట గనిలో 9,737టన్నులు, కాసిపేట–2 గనిలో 5,986టన్నులు, కల్యాణిఖని ఉపరితల గనిలో 1,79,793టన్నులు, రామకృష్ణాపూర్ ఉపరితల గనిలో 2,06,487టన్నుల ఉత్పత్తి జరిగినట్లు మొత్తం నిర్దేశిత ఉత్పత్తిలో 83శాతం జరిగిందని తెలిపారు. సంస్థ నిర్దేశించిన వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి ఇంకా మూడు మాసాలే గడువు ఉందని, ఉద్యోగులంతా బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్వో టూ జీఎం కృష్ణారావు, ఆఫీస్ హెచ్‌వోడీ శ్యాంసుందర్, అధికారులు ఉన్నారు.

రాత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలి

- జీఎం సంజీవరెడ్డి



రాత పరీక్షకు ఎంపికైన అభ్యర్థులతో జీఎం

శ్రీరాంపూర్: ఫిజికల్ టెస్టులో పాసవడం సంతోషకరమని, ఇక ఉద్యోగ ఎంపికకు చివరిగా మిగిలిన రాత పరీక్షల్లో కూడా మంచి ఉత్తీర్ణత సాధించి ఉద్యోగాలు సాధించాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి పోలీసు ఉద్యోగాల అభ్యర్థులకు సూచించారు. ప్రగతి మైదానంలో కంపెనీ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 84మంది అభ్యర్థులు శనివారం జీఎంను కలిశారు. వారిని అభినందించి ఫైనల్ రాత పరీక్షకు కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఎస్‌ఓటుజీఎం త్యాగరాజు, అధికారుల సంఘం అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదీర్, డీజీఎం గోవిందరాజులు, ఏజెంట్‌లు గోపాల్‌సింగ్, ఏజీఎం మురళీధర్, గని మేనేజర్ సంతోశ్‌కుమార్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఫిట్‌సెక్రెటరీ పీవీ రావు, శిక్షకులు సత్యనారాయణ, సురేందర్ పాల్గొన్నారు. అనంతరం జీఎం కార్యాలయంలోని ఫైనాన్స్ డిపార్టుమెంట్‌లో పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగి రఘుపాల్‌ను జీఎం సన్మానించారు.

శివదీక్షకు త్రీడీ ఆర్ట్‌లో గోల్డ్‌మెడల్



మంచిర్యాలఅర్బన్: ట్రినిటీ పాఠశాలకు చెందిన మెరుగు శివదీక్షకు త్రీడీ ఆర్ట్‌లో కళాకృతులు తయారు చేసినందుకు ఇండియా బుక్ రికార్డు నమోదు సర్టిఫికెట్‌తో పాటు గోల్డ్‌మెడల్, నగదు పురస్కారంను అందుకున్నారు. రెండేళ్లుగా త్రీడీ ఆర్ట్స్‌లో తయారు చేసిన కళాకృతులను ఇండియా బుక్ ఆఫ్ రికార్డుకు ఢిల్లీకి పంపగా అండర్–14 విభాగంలో గుర్తించి గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్‌ను పంపించారు. మంచిర్యాల ట్రినిటీ హైస్కూల్‌లో శనివారం శివదీక్షను పాఠశాల ప్రిన్సిపాల్ జాన్ థామస్‌తో పాటు పలువురు అభినందించారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న ఏమాజీ, బాధిత కుటుంబీకులు

బెల్లంపల్లి: నెన్నెల మండలం బొప్పారం గ్రామానికి చెందిన ఓ నిరుపేద కుటుంబం అన్ని రకాల అనుమతులు తీసుకుని ఇంటి నిర్మాణం చేపడుతుంటే మండల తహసీల్దార్ అనవసరంగా వెళ్లి ఆ ఇంటి పిల్లర్లు పగులగొట్టారని బీజేపీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొయ్యల ఏమాజీ ఆరోపించారు. తహసీల్దార్ వ్యవహరించిన తీరుకు నిరసనగా శనివారం బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట బీజేపీ శ్రేణులు, బాధిత కుటుంబ సభ్యులు బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏమాజీ మాట్లాడుతూ... బొప్పారం గ్రామానికి చెందిన నార పెంటక్క, తిరుపతి దంపతులు ఇంటి నిర్మాణానికి పూనుకోగా నెన్నెల తహసీల్దార్ అకారణంగా అక్కడికి వెళ్లి పిల్లర్లను పగుల గొట్టారని తెలిపారు. ఆ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ఆర్డీవో శ్యామల దేవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, అధికార ప్రతినిధి బి.హరీష్ గౌడ్, నాయకులు కేశవ రెడ్డి, రాజులాల్ యాదవ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు ఉద్యోగవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

మందమర్రిరూరల్: మందమర్రి శివారులోని జాతీయ రహదారి 363పై రహదారి పూర్తి కాకుండానే టోల్ ట్యాక్స్ వసూళ్లు చేయడంతో ఎమ్మెల్యేలు కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చుతున్నారని టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ ఆరోపించారు. ఆ యూనియన్ కార్యాలయంలో శనివారం పలు కార్మిక సంఘాల నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారితో కలిసి ఆయన మాట్లాడారు. రహదారి పూర్తయిన తర్వాతనే టోల్ ట్యాక్స్ వసూల్ చేయాలని, భూనిర్వాసితులకు, స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే అఖిల పక్షం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు వెల్ది సుదర్శన్, దేవి భూమయ్య, షరీఫ్, వాసాల సంపత్, రామస్వామి తదితరులు ఉన్నారు.